కనిపిస్తోంది. తమకు ఎదురైన అనుభవాలను అంతా చెప్పుకొస్తున్నారు.

పనులు సవ్యంగా సాగుతాయనుకుంటే పూర్తిగా నిలిచిపోతున్నాయేమిటి. సత్యం బుర్రలో వెంటనే ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. "ఫ్రెండ్స్" అంటూ గట్టిగా అరిచాడు సత్యం.స్టాఫ్ అందరూ ఒక్కసారిగా సత్యం వైపు చూశారు.

సత్యం ఉపన్యాసం యిస్తున్న ధోరణిలో "ఫ్రెండ్స్...యివ్వాళ తలెత్తిన విచిత్ర పరిణామాలకు మూలం మనం యిప్పటికీ బ్రిటిష్‌వాళ్ళు పెట్టిన రూల్స్‌నే పాటించటం. ఆ రూల్స్‌ను యధాతథంగా పాటించటం అసంభవం. మరి పనులు జరగాలి కాబట్టి 'లంచం' అనే వ్యవస్థ ఏర్పడింది. మరి మనం ఏం చేశాం..లంచాన్ని ద్వేషించాం. ఇప్పుడేమైందో చూశారు కదా. లంచం సమాజాన్ని పట్టి పీడించే క్యాన్సర్ కాదు. అదొక దివ్యౌషధం. కాదు..కాదు..వజ్రాయుధం. కాబట్టి మిత్రులారా..ప్రతిజ్ఞను రద్దు చెయ్యాలని, ప్రతిజ్ఞ పూర్వస్థితిని యధాతథంగా కొనసాగించాలని ఉద్యమం ప్రారంభించాలి."

"ప్రతిజ్ఞను రద్దు చెయ్యాలి"

"లంచాలు వర్ధిల్లాలి"

"లంచం జిందాబాద్"

వంటగదిలో వున్న వనజాక్షి ఆ అరుపులు విని కంగారుగా బెడ్‌రూం వైపు పరుగెత్తింది. భర్త చేతిలో దినపత్రిక వుంది. ఏదో ట్రాన్స్‌లో వున్నట్లుగా నినాదాలు చేస్తున్నాడు.

"ఏమండీ..ఏమండీ..ఏమైంది మీకు" అంటూ వనజాక్షి గట్టిగా కుదిపింది భర్తను. ఆ కుదుపులకు సత్యం తేరుకున్నాడు.అవినీతి నిరోధక శాఖకు సంబంధించిన వార్తను చదువుతూ అలా ఊహల్లోకెళ్లిపోయాడు సత్యం."అబ్బ యిదంతా ఊహేనా..ఎంత భయపడ్డాను" అనుకున్నాడు సత్యం.

-సి.జయపాల్‌రెడ్డి (కాజీపేట)

# మార్పు

ఆ రోజు ఆదివారం. ఉదయం ఎనిమిది గంటలు అవుతోంది. కాంతి తన ఇద్దరి పిల్లలతో బెంగుళూరు నుండి అప్పుడే వచ్చింది. దసరా సెలవులకి హైదరాబాద్ రమ్మని తమ్ముడు నిఖిల్ ఆహ్వానించటంతో కాదనలేకపోయింది కాంతి. "నీవు పెళ్ళికి రాలేకపోయావు కదా అక్కా మరి నీ మరదల్ని చూడాలని లేదా నీకు" అన్నాడు నిఖిల్. అందుకే కాంతి ఇంకే అభ్యంతరమూ చెప్పకుండా ఒప్పేసుకుంది. తమ్ముడి భార్య శిల్పని చూడగానే కాంతి భయాలన్నీ పటాపంచలయిపోయాయి. వదినగారూ అంటూ నోరారా పిలవటం, చిరునవ్వుతో పలకరించటం చూశాక ఆమె కలివిడి మనస్తత్వం కలదని ఇట్టే కనిపెట్టేసింది. పిల్లలను దగ్గరకు తీసుకుని వాళ్ళకి ఏం కావాలో అడిగి తెలుసుకుంది.


కాంతి పిల్లలు స్నానం చేసి వచ్చాక వేడి వేడి ఇడ్లీలు సర్వ్ చేసింది. ఇడ్లీ తింటూ కాంతి తమ్ముడితో అంది. "నువ్వింకా ఆఫీసుకి రెడీ అవలేదేమిట్రా!" అని. అందుకు నిఖిల్ "లేదక్కా, ఈరోజు ఆదివారం కదా, అయినా నేను 15 రోజులు సెలవు పెట్టాను- నీవు వస్తున్నావని. అందుకే ఈ 15 రోజులూ మనం జాలీగా గడపాలి. దానికి ప్రారంభం ఈరోజునుంచే చేద్దాం. ఏమంటావు" అన్నాడు ఎంతో ఉత్సాహంగా.

ఆరోజు సాయంత్రం నిఖిల్, శిల్ప, పిల్లలూ కలిసి 'టైటానిక్' సినిమాకి వెళ్ళారు. ఆ తరువాత బయట ఏదో రెస్టారెంటులో భోజనం చేసి ఇంటికి వచ్చారు. అప్పుడు సమయం పది అయింది. ఇక తనకి కేటాయించబడిన గదిలో పిల్లలను పడుకోబెడదామని కాంతి పక్క సర్దుతూంటే, శిల్ప చేతిలో దిండూ దుప్పటితో వచ్చింది.

"వదినగారూ ఈ పదిహేను రోజులూ పిల్లలు మీ తమ్ముడితో పడుకుంటారు. నేను మీకు కంపెనీ ఇస్తాను" అన్నది.

కాంతి ఆశ్చర్యపోతూ అంది "అదేంటి శిల్పా మీరిద్దరూ కొత్తగా పెళ్ళైనవాళ్ళు కదా..నీవు నాతో పడుకోవటం ఏంటి! నో నో.. డోంట్ బీ సిల్లీ" అని నిరాకరించింది. కానీ శిల్ప అందుకు ఒప్పుకోలేదు. రాత్రి చాలాసేపు కాంతీ శిల్పా కబుర్లు చెప్పుకున్నారు. ఆ తరువాత శిల్పకి నిద్ర పట్టేసింది. కానీ కాంతి కంటికి మాత్రం నిద్ర కరువయింది. స్నేహశీలి అయిన శిల్పని చూస్తుంటే తనకి సరిగ్గా ఎనిమిదేళ్ళ క్రిందట తన జీవితంలో జరిగిన సంఘటన గుర్తుకువచ్చింది.

అవి తనకి కొత్తగా పెళ్ళైన రోజులు. శ్రీధర్ తనూ ఎంతో ఆనందంగా ఒకరికి ఒకరుగా కలిసిపోయి, ఈ ప్రపంచంతో సంబంధం లేనంత డీప్‌గా గడుపుతున్న రోజులవి. శ్రీధర్ తల్లీ తండ్రీ విజయవాడలో ఉండడం మూలంగా తనకి అత్తామామల పోరు కూడా లేకుండాపోయింది. కానీ ఇంతలో తమ ఆనందాన్ని భగ్నం చేస్తూ తన వదినగారు ఇద్దరు పిల్లలతో చెప్పాపెట్టకుండా సడెన్‌గా దిగింది. పెళ్ళికి ఎలాగూ రాలేకపోయాను కదరా అందుకే మీ ఆవిడ్నీ, మీ కాపురాన్ని చూసిపోదామని వచ్చాను అంది. కానీ తనకి మాత్రం ఒళ్ళు మండిపోయింది. ఎంత పెళ్ళికి రాలేకపోతే మాత్రం, ఇలా క్రొత్తగా పెళ్ళైన వాళ్ళింటికి, ఎంత తమ్ముడైతే మాత్రం ఇలా మ్యానర్స్ లేకుండా వచ్చేయటమేనా అని తను కోపంతో కుతకుతలాడిపోయింది.



అందుకే తన వదినగారితో కావాలనే అంటీ ముట్టనట్లు, ముభావంగా ఉండిపోయింది. దాంతో కాంతి వదినగారు చాలా హర్ట్ అయింది. నాలుగు రోజులకే తిరుగు ప్రయాణమైంది. తన తమ్ముడు శ్రీధర్ ఎంత బ్రతిమాలినా వినకుండా వెళ్ళిపోయింది. శ్రీధర్ ఏమీ అనలేదు. ఆ తరువాత ఈ ఎనిమిదేళ్ళల్లో ఒక్కసారి కూడా తమ ఇంటికి రాలేదు. అప్పట్లో తను చేసింది తప్పు అని తనకి అనిపించలేదు.

కానీ ఈరోజు తన మరదలు శిల్ప బిహేవియర్ చూసాక తను చేసింది ఎంత క్షమించరాని తప్పో తెలిసివచ్చింది. ఆమె మనస్సు పశ్చాత్తాపంతో రగిలిపోయింది. అవును..ప్రతీ ఆడపిల్లా పుట్టింటి నుంచీ, తమ అన్నదమ్ముల నుంచీ ఆశించేది ప్రేమాభిమానాలే కానీ ఆస్తిపాస్తులు కాదు. తను అది గ్రహించలేకపోయింది.ఈ గిల్టీ ఫీలింగ్స్‌తో ఆమెకు రాత్రంతా సరిగ్గా నిద్రపట్టలేదు.

* * *

నిఖిల్, శిల్పలతో రెండు వారాలు ఎలా గడిచిపోయాయో కూడా తెలీలేదు కాంతికి. ప్రతీరోజూ ఇంట్లో పనులు ముగించుకుని ఎక్కడికో అక్కడికి వెళ్ళేవారు. బయటికి వెళ్ళటం బోర్ కొడితే, ఇంట్లోనే కూర్చుని అక్కాతమ్ముళ్ళు తమ చిన్ననాటి కబుర్లు చెప్పుకునేవారు.

ఆఖరుకి వీడ్కోలు తీసుకోవలసిన రోజు రానే వచ్చింది. ఆరోజు శిల్ప స్పెషల్ లంచ్ ప్రిపేర్ చేసింది. నిఖిల్ అక్కకి ఒక కంచిపట్టుచీర కొన్నాడు. వదినగారికి పళ్ళూ, పూలూ తాంబూలంతో పాటు తాము కొన్న చీర కూడా పెట్టి ఇద్దరూ ఆమె కాళ్ళకు నమస్కరించారు. తమ్ముడూ మరదలూ చూపిస్తున్న ఆప్యాయతకు ఆమె కళ్ళు చెమర్చాయి ఆనందంతో. గద్గద స్వరంతోనే వాళ్ళిద్దరినీ కలకాలం పిల్లా పాపలతో వర్ధిల్లమని ఆశీర్వదించింది.

శిల్పా, నిఖిల్ ఇద్దరూ స్టేషన్‌దాకా వచ్చి కాంతీ, పిల్లలను సాగనంపారు.

* * *

ట్రెయిన్ బెంగుళూరు స్టేషన్‌లో ఆగగానే, డోర్ దగ్గర నిలబడ్డ కాంతికి, శ్రీధర్ దూరం నుంచి చేయి ఊపుతూ కనిపించాడు. తనూ చేయి ఊపింది.

దగ్గరకి వచ్చిన శ్రీధర్ అడిగాడు భార్యని ట్రిప్ ఎలా జరిగిందని. "బ్రహ్మాండంగా జరిగింది ఒక్క మీరు లేని లోటు తప్ప" అంది భర్తతో. కారులో వెళ్తున్నప్పుడు కాంతి అన్నది శ్రీధర్‌తో.

"ఏమండీ నేను మిమ్మల్ని ఓ కోరిక కోరతాను. తీరుస్తారు కదూ అని అడిగింది"

అందుకు శ్రీధర్ "అదేంటి నా ప్రియాతిప్రియమైన భార్య ఏదైనా అడగటమూ నేను ఇవ్వకపోవటమూనా...నెవర్" అన్నాడు.

"అయితే వినండి. మనం ఈ సమ్మర్‌లో మీ అక్కా, బావగారిని మన ఇంటికి ఆహ్వానిద్దాము" అనేసి ఆగిపోయింది. భర్త ముఖంలో ఆశ్చర్యం సంతోషం కలగలిపిన మిశ్రమ భావాలను గమనిస్తూ మళ్ళీ తనే అన్నది. "అలా చూడకండి శ్రీ..నేను మనస్ఫూర్తిగా అంటున్నాను" భార్య మాటలలోని నిజాయితీని గుర్తించి శ్రీధర్ ఒక చేత్తో డ్రయివ్ చేస్తూ మరో చేత్తో భార్యని దగ్గరికి తీసుకున్నాడు ప్రేమగా.

-మాధవపెద్ది ఉష (హైదరాబాద్)